క్లుప్తంగా

సిబ్బంది పనితీరుపై డీఎల్‌పీవో ఆగ్రహం



ట్యాంకు లోపలి భాగాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రాఘవన్

చింతూరు: తాగునీటి తాగునీటి ట్యాంకు పరిశుభ్రంగా లేకపోవడంపై రంపచోడవరం డీఎల్‌పీవో రాఘవన్ కుమ్మూరు గ్రామ పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కుమ్మూరులోని కురసం గుంపులో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు లోపలికి స్వయంగా దిగిన ఆయన క్లోరినేషన్‌తో పాటు ట్యాంకు పరిశుభ్రంగా లేకపోవడం గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు తాగునీటి ట్యాంకులకు సంబంధించి క్లోరినేషన్‌తో పాటు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆయన ఆదేశించారు.

మెట్రో కార్పొరేషన్ ఎండీని కలిసిన అరకు ఎమ్మెల్యే



అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంనకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎండీ రావు

సాక్షి, పాడేరు: అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం బుధవారం విశాఖలోని మెట్రో కార్పోరేషన్ ఎండీ యూజేఎం.రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండీ అరకు ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛం అందజేశారు. అకౌంట్ అధికారి శ్రీరామ్మూర్తి తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలిసిన జీసీసీ ఎండీ



కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన జీసీసీ ఎండి కల్పనాకుమారి

మహారాణిపేట: జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్‌ను బుధవారం గిరిజన సహకార సంస్థ (జీసీసీ) మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి మర్యాద పూర్వకంగా కలిశారు. అరకు కాఫీ, సహజసిద్ధ తేనె తదితర వస్తువులతో కూడిన కిట్‌ను అందజేశారు

ఇ.రామవరంలో పశు వైద్యశిబిరం

గంగవరం : ఇ.రామవరంలో స్థానిక పశు వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ రామలక్ష్మి పాల్గొని పశు రైతులకు మందులను పంపిణీ చేశారు. పశువులకు సకాలంలో టీకాలు వేయించాలని రైతులను సూచించారు. కీర్తన అనిల్,రాజు, నాగేశ్వరరావు, బషీర్ పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న సర్పంచ్, నాయకులు

చింతూరు: చిడుమూరు, పాలగూడెం, నర్సింహాపురం గ్రామాలకు సర్పంచ్ కాక అరుణ కుమారి ఆధ్వర్యంలో బుధవారం వరద బియ్యం పంపిణీ చేశారు. బాధితులకు 25 కిలోల బియ్యం, కందిపప్పు, మంచినూనె ప్యాకెట్లను ఆమె అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సీతారామయ్య, బాలకృష్ణ, జయరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కొయ్యూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఎలాంటి రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనవద్దని ఎంపీడీవో లాలం సీతయ్య సూచించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియామవళి సెప్టెంబర్ ఆరు వరకు అమలులో ఉంటుందన్నారు. ఉద్యోగులు ఎవరూ రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, ప్రజాప్రతినిధులతో ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయన్నారు.

గత సర్కారు సాయం..
రహదారికి మోక్షం

- ఏళ్ల తరబడిన సమస్యల పరిష్కారం
- జాజులబంధ రోడ్డుకు కోటి రూపాయల నిధులు మంజూరు
- పూర్తయిన మూడు కిలోమీటర్ల రోడ్డు
- వర్షాలతో నిలిచిన మిగిలిన పనులు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈ చాణక్య, జేఈ రామకృష్ణ



పనులు జరుగుతున్న దృశ్యం

కొయ్యూరు: ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మూలపేట పంచాయతీ జాజులబంద గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. గ్రామస్తులు ఎక్కడి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం.. దశాబ్దాలుగా కనీస రహదారి లేక స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న మట్టి దారిపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అత్యవసర సమయాల్లో గ్రామస్తులకు వైద్య సేవలు అందని ఘటనలు కోకొల్లలు... వర్షాలు కురిసినపుడు రహదారి లేక బయట ప్రాంతాలతో సంబంధాలు తెగిపోతున్నాయి...దశాబ్దాలుగా ఈ సమస్య ఉన్నా ఏ ప్రభుత్వం కనీసం రోడ్డు పనులు చేపట్టలేదు...అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏజెన్సీలో అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కోట్లాది రూపాయలతో ఏజెన్సీలోని అన్ని గ్రామాలకు రహదారులతో పాటు తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక పనులు జరిగాయి. ఇందులో భాగంగానే కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీ జాజులబంద గ్రామంలోని రహదారి నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరయ్యాయి. అయితే సార్వత్రిక ఎన్నికల కోడ్ వల్ల పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగియడంతో పనులు ప్రారంభమయ్యాయి. దశాబ్దాల సమస్య పరిష్కారం కానుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీ జాజులబంద గ్రామానికి వేస్తున్న రహదారి రోలుగుంట మండలం ఆర్ల నుంచి జాజులబంద గ్రామం వరకు వేస్తున్న 10 కిలోమీటర్లు ఉంది. ఈ మార్గంలో సుమారు ఐదు గ్రామలకు గిరిజనులకు ఈ రహదారి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ రహదారి నిర్మాణానికి కోటి రూపాయల నిధులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. కొండల నడుమ రోడ్డు వేయాల్సి రావడంతో సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పనులు నిలిపివేశామని, వర్షాలు తగ్గిన తరువాత పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు. జాజులబంధ గ్రామానికి వెళ్లాలంటే రోలుగుంట మండలం అర్ల నుంచి మార్గం ఉంది. అయితే ఏడు కిలోమీటర్ల దూరం వరకు రోడ్డు లేకపోవడంతో దానిని వేస్తున్నారు.ఇప్పటి వరకు రూ.29 లక్షలకు పైగా ఖర్చు చేశారు.మరో 3.2 కిలోమీటర్ల దూరం వేయాల్సి ఉండగా వర్షాలు ప్రారంభం కావడంతో వేయలేక పోయారు. దీనిపై కొద్ది రోజుల కిందట గ్రామస్తులు రోడ్డు వేయాలని ఆందోళన చేశారు. అయినా వాతావరణం అనుకూలించకపోవడంతో వేయలేకపోయారు.



అర్ల-జాజులమంద మధ్యలో కొంతభాగం పూర్తయిన రహదారి

రాయి తొలగింపునకు పోలీసుల అనుమతి

రోలుగుంట మండలం అర్ల గ్రామం నుంచి చేపడుతున్న రహదారికి అడ్డంగా రాయి ఉంది. దీనిని పేలిస్తే తప్ప తీయడం సాధ్యం కాదు. అయితే ఇందుకోసం రోలుగుంట పోలీసులకు ఇంజినీరింగ్ అధికారులు లేఖ రాశారు. వర్షాలు తగ్గితేనే రోడ్డు పనులు పూర్తి చేసే అవకాశం కనిపిస్తుంది. పోలీసు శాఖ నుంచి అనుమతులు వచ్చిన తరువాత పనులు ప్రారంభించనున్నట్టు పలువురు చెబుతున్నారు.

వర్షాలు తగ్గగానే పనులు

జాజులబంధకు రహదారిని తొందరగా వేయాలని నిర్ణయించాం. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో పనిచేయలేకపోతున్నాం. కొన్ని పనులు యంత్రాలతో చేయాల్సి ఉంది. వర్షాలు తగ్గితేనే పనులు చేయగలం. దీంతో పాటు రాయిని పేల్చేందుకు అనుమతి రావలసి ఉంది. ఇవి రాగానే పనులు మొదలు పెడతాం.

– రామకృష్ణ, పీఆర్ జేఈ

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి



అడ్డతీగలలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమణి

గంగవరం : గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సత్య సులోచన, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అన్నారు. చిన్నఅడ్డపల్లి గ్రామంలో ఎండపల్లి సర్పంచ్ బండారు రామలక్ష్మి అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభను బుధవారం నిర్వహించారు. ఈ గ్రామసభలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, తహసీల్దార్ సత్యసులోచన , సర్పంచ్ రామలక్ష్మి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రాంబాబు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫయాజ్‌భాషా(జిలానీ), మండల సర్వేయర్ వీరప్పదొర, వీఆర్వోలు వెంకటేశ్వర్లు, వెంకన్నదొర, రవి, సత్తిబాబు పాల్గొన్నారు.

అడ్డతీగల: గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న గ్రామసభల ప్రయోజనాలను ప్రజలంతా ఉపయోగించుకోవాలని అడ్డతీగల తహసీల్దార్ పి.నాగమణి అన్నారు. మండలంలోని కొత్తపాలెంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగమణి మాట్లాడుతూ భూములకు మ్యూటేషన్ వంటి పనులు ఏమైనా పెండింగ్ ఉన్నా లేక వాటి పనులు చేయవలసి ఉన్నా తమకు తెలియజేయాలన్నారు. రేషన్‌కార్డులు, కులధ్రువీకరణ పత్రాలు ఇతర రెవిన్యూ సేవలు అవసరమైతే వినతులిస్తే ఆయా పనులు చేపడతామన్నారు. రెవెన్యూ శాఖ అందించే వివిధ రకాల సేవలను ఆమె గ్రామ సభలో వివరించారు.

కంప్యూటర్ విద్యతో ఉపాధి అవకాశాలు



కాలేజీలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి, అధ్యాపకులు

చింతపల్లి(సాక్షి,పాడేరు): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అమలుజేస్తున్న కంప్యూటర్ విద్యను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి చెప్పారు. కళాశాలలో కొత్త కంప్యూటర్ కోర్సులను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయభారతి మాట్లాడుతూ విద్యార్థులంతా ఉన్నత చదువులతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం పొందాలన్నారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు కె.లీలాపావని మాట్లాడుతూ కంప్యూటర్ విద్యతో ఎక్కువగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. డిగ్రీ కళాశాలలోను కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ పాత్రుడు, అధ్యాపకులు డాక్టర్ వి.రమణ, కె.సంతోషి, డాక్టర్ కేజీయా, ఐ.రవీంద్రనాయక్, జి.జగదీష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



ఎంఈఓ బాలరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎటపాక: ఏజెన్సీలో గత 40ఏళ్లగా విద్యాశాఖలో తన సేవలు అందించిన ఎంఈవో నీలి బాలరాజు సేవలు అభినందనీయమని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను అన్నారు. ఎటపాక ఎంఈఓగా విధులు నిర్వహించి బుధవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశఋరు. పలువురు బాలరాజుకు పుష్పగుచ్చాలు ఇచ్చి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడారు. విద్యాభివృద్ధికి నాలుగు దశాబ్దాలుగా బాలరాజు విశేష సేవలు అందించారని కొనియాడారు. ఎంఈఓ సరియం రాజులు, ఏటీఏ మండల అధ్యక్షుడు కాక రాజు, ప్రధాన కార్యదర్శి కాక శివశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు అనిల్, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డస్ట్‌బిన్‌ల పంపిణీ



పంచాయతీలకు పంపేందుకు డస్ట్‌బిన్‌లను సిద్ధం చేస్తున్న సిబ్బంది

కొయ్యూరు: సాధారణ ఎన్నికలకు మందు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని 33 పంచాయతీలకు 25వేల డస్ట్‌బిన్‌లను సరఫరా జరిగింది. ప్రస్తుతం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి తడి చెత్త, పొడి చెత్త వేసేకునేందుకు వీలుగా రెండు డస్ట్‌బిన్‌లను ఇస్తున్నారు. ఆయాడస్ట్‌బిన్‌లలో సేకరించిన చెత్తను పారిశుధ్య కార్మికులు నిర్దేశించిన డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ప్రతీ రోజూ లేదా రెండు రోజులకు ఒకసారి చెత్తను తరలించనున్నారు. దీనిపై ఎంపీడీవో లాలం సీతయ్య మాట్లాడుతూ డస్ట్‌బిన్‌లు ఎన్నికలకు ముందు వచ్చాయన్నారు. దీంతో వాటిని ఆయ పంచాయతీలకు పంపిస్తున్నట్టు చెప్పారు.

గ్రామస్తులకు రక్షిత తాగునీరు



తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ పాపారావు

గూడెంకొత్తవీధి: గిరిజనులందరికీ రక్షిత మంచి నీటిని అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రత్యేక పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా మండలంలో రక్షిత నీటి పథకాలను ఆయన బుధవారం పరిశీలించారు. దుచ్చరిపాలెంలోని నీటి పథకాన్ని పరిశీలించిన ఆయన నమూనాలను పరీక్షల నిమిత్తం సేకరించి వాటిని పరీక్షిస్తున్నట్టు తెలిపారు. శుద్ధజలాన్ని గిరిజనులకు అందించాలని ఆ బాధ్యతలను సచివాలయ సిబ్బంది తీసుకోవాలని ఆయన సూచించారు. ఈవోపీఆర్డీ పాపారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- తుప్పపట్టి కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు
- ఆందోళనలో గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



బి.బొడ్డాపుట్టులో తుప్పపట్టి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

హుకుంపేట: మండలంలోని బి.బొడ్డాపుట్టు పంచాయతీ తాడిపుట్టు, ముల్కయిపుట్టు ,బొర్ర మామిడి, దబ్బగరువు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆయా గ్రామాల్లోని ఇనుప విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి, రంధ్రాలు ఏర్పడి ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. ఏ సమయంలోనైనా ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులకు స్తంభాలు ఎప్పుడు కూలిపోతాయోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నాయి. బి.బొడ్డాపుట్టు పంచాయతీలోని గ్రామాల్లో సుమారు 40కు పైగా విద్యుత్ స్తంభాలు కూలే దశకు చేరుకున్నాయని భయపడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు విద్యుత్ శాఖాధికారులకు వినతులిచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి పాడైన విద్యుత్ స్తంభాలు తక్షణమే తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని సర్పంచ్ పాడి అచ్చులమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాడి బాలన్నతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

వరద సాయం పంపిణీ



కూటూరు సచివాలయంలో నగదు, బియ్యం పంపిణీ చేస్తున్న అధికారులు

కూనవరం: వరద బాధితులకు ప్రభుత్వం సాయం కింద రూ. 3000 నగదు, 25 కేజీలు బియ్యం మండల పరిధిలోని 11 సచివాలయాల్లో బుధవారం పంపిణి చేశారు, మండల వ్యాప్తంగా 9995 మంది రేషన్‌కార్డుదారులకు సరకులు, నగదు అందజేస్తున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ నాగరాజు చెప్పారు.

నెల్లిపూడి బ్రిడ్జిపై హెచ్చరిక బోర్డు



నెల్లిపూడి బ్రిడ్జి వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

గంగవరం : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాగుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి పోలీసు సిబ్బందిని గస్తీ ఉంచుతున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం నెల్లిపూడి బ్రిడ్జి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుందని బ్రిడ్జి వద్ద వాహనచోదకులు అప్రమత్తంగా తమ వాహనాలను నడపాలన్నారు. హెచ్‌సీ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది గస్తీ నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ

హుకుంపేట: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గిరిజనులు జాగ్రత్తలు పాటించే విధంగా వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలని సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ సూచించారు. స్థానిక సచివాలయంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు సీజనల్ వ్యాధుల ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గిరిజనులు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటు జాగ్రత్తలు పడేలా తెలియపరచాలని సూచించారు. జ్వరాల బారినపడితే వెంటనే గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి విస్తరణ అధికారి కోడా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఔదార్యం



హుకుంపేట ఎంపీటీసీకి ఆర్థిక సాయమందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయికులు

హుకుంపేట: హుకుంపేట టీడీపీ నాయకురాలు, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మ రమ భర్త సింహాచలం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు అరకు ఎంపీ డాక్టర్ తనుజారాణి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ దంపతులు ఆదేశాల మేరకు బుధవారం స్థానిక పార్టీ నాయకులు దాలిగుమ్మడి గ్రామానికి చేరుకుని ఎంపీటీసీ సభ్యురాలుని పరమార్శించారు. ఇందులో భాగంగా ఎంపీ దంపతులు మరియు జిల్లా వాణిజ్యా విభాగ అధ్యక్షుడు ఒంటుబు శామ్యేల్ కలిసి అందించిన రూ.15వేలు ఆర్థిక సహాయాన్ని నాయకులు ఎంపీటీసీ కుటుంబానికి అందించారు.

బాధిత కుటుంబానికి ఆదుకుంటామని పార్టీ శ్రేణులు భరోసా కల్పించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు కాతరి సురేష్‌కుమార్,సర్పంచ్‌లు గుమ్మా శ్యామ్‌సుందర్, ముంచంగిపుట్టు మండల పార్టీ అధ్యక్షుడు పద్మరావు, నాయకులు నైని సత్తిబాబు, పాంగి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి



కణతలబంద గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కిరణ్

వై.రామవరం: మండలంలోని ఉపాధి కూలీల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేవారు. పార్టీ మండల కార్యదర్శి కంభం శాంతిరాజు అధ్యక్షతన కణతలబంద గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పలువురు నేతలు మాట్లాడుతు నెలలు తరబడి ఉపాధి కూలీల బకాయిలు చెల్లించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకంలో కూటమి ప్రభుత్వాలు తీసుకొచ్చిన మార్పులను తక్షణమే ఉపసంహరించుకోకపోతే కూలీలు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి పథకం ద్వారా వ్యవసాయ కూలీలలకు పనిదినాలు కల్పించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు 250 రోజులు పనిదినాలు కల్పించి, రోజుకు రూ.600 లు కూలీ చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించి, తప్పనిసరిగా పేస్లిప్పులు అందజేయాలన్నారు. మండలంలోని చామగడ్డ పంచాయతీ కప్పలబంద గ్రామ సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తుందని, ఆ గ్రామస్తులు నిత్యావసర వస్తువులు కొనుగోలుకు, ఆస్పత్రికి వెళ్లి వైద్యసేవలు పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ కప్పలబంద వాగుపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న కూరగాయలు, తదితర నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించి, సామాన్యులకు అందుబాటులోకి తేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలన్నారు. వై.రామవరం నుంచి మఠంభీమవరం మీదుగా గుర్తేడు రోడ్డు నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరుచేసి, రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడి చేసి, ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్, నేత మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి



కుసుమరాయి పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో-2 మల్లేశ్వరరావు

గంగవరం: మండలంలోని కుసుమరాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో-2 టి.మల్లేశ్వరరావు, సీఆర్పీలు శివ, ప్రసాద్ బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీలు చేశారు. పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రగతి, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. పాఠశాల ఆవరణాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు బోధపడేలా పాఠాలు బోధించాలని, మెరుగైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పలు సమస్యలును పాఠశాల హెచ్‌ఎం కుసుమకుమారి ఎంఈవో దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

పెదబయలు: గంజాయి వల్ల భవిష్యత్తు నాశనమవుతుందని ఎస్ఐ పి.మనోజ్ కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ అమీత్ బర్ధర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో స్థానిక ఏపీఆర్‌డబ్ల్యూఆర్ పాఠశాలలు, కాలేజీలలో విద్యార్థులకు గంజాయి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులు గ్రామస్తులకు తెలియజేయాలన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఉద్యాన పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి



రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: ఉపాధి హామీ పథకం ద్వారా గిరిజన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన పంటలను సద్వినియోగం చేసుకోవాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, దామనాపల్లి సర్పంచ్ కుందరి రామకృష్ణ అన్నారు. ఉద్యాన పంటల సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. పంచాయతీలో 170 ఎకరాలకు సంబంధించి ఉపాధి పథకంలో రైతులకు సిల్వర్‌ఓక్ మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఏపీఓ అప్పారావు, ఉద్యాన అధికారి రామ్‌ప్రసాద్, వీఆర్‌పీలు వివేకానందదొర, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.